క్లుప్తంగా

నేడు శని త్రయోదశి పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కం డ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి, ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రమేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివునికి, నందీశ్వరుడికి ఏక కాలంలో అభిషేకాలు, పూజలు చేస్తున్నట్లు తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చంద్రమౌళీశ్వరాలయానికి పంచలోహ విగ్రహాలు


ఆలయంలోని పంచలోహ విగ్రహాలు

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్రమౌళీశ్వర స్వామి ఆలయానికి శివపార్వతుల పంచలోహ విగ్రహాలను చెన్నైకి చెందిన దాత సావిత్రి బహూకరించారు. శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని ఆలయానికి విచ్చేసిన దాత 59 కిలోల బరువుతో 27 ఇంచుల పొడవుతో ఉన్న పంచలోహ విగ్రహాలను ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యంకు అందించారు. ఈ నెల 22వ తేదీన ఆలయ అష్టబంధన కుంభాభిషేక ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో పంచలోహ విగ్రహాలను దాత అందించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నగరి సబ్ డివిజన్‌కు ఉత్తమ అవార్డు


సీఎండీ నుంచి అవార్డు అందుకుంటున్న ఏడీఈ

నగరి: ట్రాన్స్‌కోలో నగరి సబ్‌డివిజన్‌కు డిస్కమ్ లెవల్ అవార్డు దక్కింది. అవార్డుల కోసం ఏపీఎస్పీడీసీఎల్ వారు నిర్వహించిన అంతరాయం లేని విద్యుత్ సరఫరా విభాగంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు సబ్‌డివిజన్ ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎండీ నుంచి ఏడీఈ ఎ.వెంకటముని అవార్డు అందుకున్నారు. ట్రాన్స్‌కోలోని అందరి కృషితోనే సబ్‌డివిజన్‌కు అవార్డు దక్కిందన్నారు.

నగరి సీఐగా ఎం.మహేశ్వర్


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ

నగరి: సీఐగా ఎం.మహేశ్వర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరలో సీఐగా ఉన్న సురేష్ బదిలీపై పుట్టపర్తి రూరల్‌కు వెళ్లడంతో పీటీసీ కళ్యాణి డ్యామ్ నుంచి బదిలీపై నగరి సీఐగా మహేశ్వర్ విచ్చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ప్రత్యేక చొరవ చూపుతానని, ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారిస్తామని తెలిపారు.

కరాటేలో నగరి విద్యార్థుల ప్రతిభ


బహుమతులు పొందిన విద్యార్థులతో కరాటే మాస్టర్

నగరి: తమిళనాడు తిరువణ్ణామలైలో గురువారం నిర్వహించిన 48వ జపాన్ షిటో రాయ్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో నగరి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కరాటే మాస్టర్ అన్నాదురై ఆధ్వర్యంలో నగరి నుంచి పోటీలకు హాజరైన విద్యార్థుల్లో 18 మంది ప్రతిభను కనబరచి అవార్డులు అందుకున్నారు. కియోన్, కటా, కుమితే తదితర విభాగాల్లో పోటీలకు హాజరైన విద్యార్థులు అవార్డులు, సర్టిఫికెట్లు అందుకున్నట్లు కరాటే మాస్టర్ తెలిపారు. ఈ పోటీలకు సినీనటుడు బబ్లూ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

ఐరాల: మండలంలోని దామరగుంట ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు శేఖర్‌రెడ్డి, పృథ్వీరెడ్డి, తేజస్విని, శశాంక్, చిట్టిబాబు, గిరినాయుడు, ధనుంజయరెడ్డి, సంధ్యారాణి రూ.50 వేలతో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల గ్రంథాలయాన్ని శుక్రవారం స్థానిక సర్పంచ్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు ప్రారంభించారు. గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలతో పాటు బీరువా అందించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించడానికి దాత పీవీసీ జ్యువెలరీ యజమాని హరి రూ.15 వేలు విలువ చేసే ఆర్‌ఓ వాటర్ ప్యూరిఫయిర్‌ను అందజేశారు. దాతలు మాట్లాడుతూ విద్యార్థులు, గ్రామస్తుల విజ్ఞానార్జన కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. హెచ్‌ఎం వినాయకరెడ్డి, చంద్రారెడ్డి, ఆనందయ్య, వెంకటేశు పాల్గొన్నారు.

కానరాని కల్వర్టులు


యనమలమంద సమీపంలో కల్వర్టు లేని రోడ్డు

- ప్రధాన రహదారుల్లో ప్రయాణం సంకటం

వెదురుకుప్పం: మండలంలోని ప్రధాన రహదారుల్లో కొన్న చోట్ల కల్వర్టులు లేక వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఆదమరిచి వాహనాలు నడిపితే ప్రమాదాలు తప్పడం లేదు. రోడ్లపై వాగులు, వంకలు ప్రవహిస్తుండడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రధానంగా ఆళ్లమడుగు గ్రామం నుంచి ఎనమలమంద గ్రామం వరకు గల ప్రధాన రహదారిపై పలు చోట్ల రోడ్డు అధ్వానంగా ఉంది. ఒక్కొక్క చోట 3 నుంచి 4 అడుగులలోతు గుంతల్లో వాహనాలు వెళ్లాల్సి వస్తోంది. దీనికి తోడు ప్రధాన రహదారి పక్కన దట్టమైన అడవి ఉంది. వర్షాకాలంలో అడవి నుంచి వచ్చే వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. నీటి ప్రవాహంతో అనేక చోట్ల వాగులను తలపిస్తోందని తద్వారా వాహనాలు నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం రోడ్డు కోతకు గురై దుస్థితికి చేరింది. అక్కడక్కడ రోడ్డు వాగులను తలపిస్తుండడంతో వాహన ప్రయాణం నరకంగా మారింది. కల్వర్టులు నిర్మించాలని పలు మార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు.

వర్షం వస్తే అంతే సంగతులు

ఇదిలా ఉండగా వెదురుకుప్పం నుంచి దేవరగుడిపల్లె వరకు తిరుపతి–చిత్తూరు ప్రధాన రహదారిపై అనేక చోట్ల వంకలు సాగుతోంది. తంగేళిమిట్ట సమీపంలోని బుగ్గ వంక రోడ్డుపై ప్రవహిస్తోంది. ఇక్కడ రెండు వైపులా ప్రధాన రహదారి సమాంతరానికి కన్నా తగ్గులో ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మూడు అడుగుల మేర నీరు ప్రవహించడంతో వాహనాలు కొట్టుకుపోతున్నాయి. వరదలు వచ్చినప్పుడల్లా రోడ్డుపై వాహనాలు నడప లేకపోతున్నట్లు వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు దాటేందుకు తంటాలు పడుతున్నారు. రెడ్డేపల్లె వద్ద రోడ్డు నాలుగు అడుగుల లోతులో ఉంది. తిరుమలయ్యపల్లె, పెద్దబైలు, దేవరగుడిపల్లె సమీపంలో ఇలాంటి పరిస్థితి నెలకొని ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. గతంలో రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించడంతో ద్విచక్రవాహనం కొట్టుకుపోయింది. ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు స్పందించడం లేదని చెప్తున్నారు. అదేవిధంగా పెరుమాళ్లపల్లె వద్ద ప్రధాన రహదారిపై చెంచుగుడి చెరువు నుంచి మొరవ ప్రవహించడంతో రోడ్డుపై వర్షపు నీరు వెల్లువలా ప్రవాహం ఉండేది. దీంతో రోడ్డుపై కల్వర్టు నిర్మాణం చేపట్టాలని అప్పటి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే నిధులు మంజూరు చేయించి కల్వర్టు నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించారు. పాతగుంట, గుండుపల్లె సమీపంలో కూడా రెండు ప్రాంతాల్లోనూ చెరువుల నుంచి వర్షపు నీరు రోడ్డుపై ప్రవాహం ఉండడంతో రాకపోకలకు అసౌకర్యం ఏర్పడుతోంది. సమస్యను పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌కు అశ్రు నివాళి


నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: 49 కొత్తపల్లిమిట్ట పంచాయతీ సర్పంచ్ ఢిల్లయ్య భార్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వేదమణి(55) గురువారం రాత్రి అనారోగ్యంతో తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి శుక్రవారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట జడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

రామచంద్రారెడ్డి మృతి తీరని లోటు

కార్వేటినగరం: వైఎస్‌ఆర్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి మారుసాని కుటుంబ సభ్యులు ఎంతో కృషి చేశారని వారిలో రామచంద్రారెడ్డి(61) అనారోగ్యంతో మృతి చెందడం తీరని లోటని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మండల పరిధిలోని ఆర్కేవీబీ పేట గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ లోకనాథరెడ్డి సోదరుడు, వైఎస్‌ఆర్ సీపీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి గురువారం మృతి చెందినట్లు సమాచారం అందుకున్న ఆయన గ్రామానికి చేరుకున్నారు. రామచంద్రారెడ్డి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నారాయణస్వామి మాట్లాడుతూ ఆయన సేవలను పార్టీ ఎప్పటికీ మరచిపోలేదని తెలిపారు. రామచంద్రారెడ్డికి నివాళులర్పించిన వారిలో మాజీ మండల కన్వీనర్ ధనుంజయవర్మ తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవకు పురస్కారం


అవార్డు అందుకుంటున్న హాస్టల్ కుక్ జయపాల్

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట ఎస్సీ బాలుర వసతి గృహంలో కుక్‌గా పనిచేస్తున్న జయపాల్‌కు ఉత్తమ పురస్కారం లభించింది. చిత్తూరులో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ కుక్‌గా ప్రశంసాపత్రం, అవార్డును అందుకున్నారు.

ఘనంగా ఏపీజీఈఏ గుర్తింపు దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

పుత్తూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ) ప్రభుత్వ ఉద్యోగులను సరైన మార్గంలో నడిపిస్తోందని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో ఏపీజీఈఏ గుర్తింపు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులంతా ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ పుత్తూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు రవికుమార్, సంఘ నాయకులు శ్రీహరిరాజు, రవిచంద్ర, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటిని అందించడమే లక్ష్యం


క్లోరినేషన్ సిస్టం పరికరాన్ని అమర్చి నీటిని సరఫరా చేస్తున్న అధికారులు

వెదురుకుప్పం: ఇన్‌లైన్ క్లోరినేషన్ సిస్టం ద్వారా నీటిని శుద్ధి చేసి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శైలజకుమారి అన్నారు. వెదురుకుప్పం గ్రామం, ఆదిఆంధ్రవాడ, తూర్పు ఎస్సీ కాలనీ, సీఆర్‌కండ్రిగ, సీఆర్‌కండ్రిగ ఎస్సీ కాలనీల్లోని ట్యాంకులకు ఇన్‌క్లోరినేషన్ సిస్టం ద్వారా అమర్చిన పరికరాలతో నీటిని శుద్ధి చేసేందుకు ట్యాబ్లెట్లను ఉంచారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానాన్ని శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ వెదురుకుప్పం గ్రామ పంచాయతీలోని 5 గ్రామాల్లో కాలుష్య రహిత నీటిని అందించేందుకు ప్రయోగాత్మక విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. బోరులోంచి వచ్చే పైప్‌లైన్‌కు ఇన్‌క్లోరినేషన్ సిస్టం ద్వారా పరికరాన్ని అమర్చి 200 గ్రాముల క్లోరిన్ ట్యాబ్లెట్ ఉంచడం ద్వారా నీటిని శుద్ధి చేసి ట్యాంకుకు పంపుతామన్నారు. ప్రధానంగా వర్షాల కాలంలో నీళ్ల కలుషితమై అంటు వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతున్న నేపథ్యంలో అరికట్టేందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. సర్పంచ్ శిల్ప సహకారంతో స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, వైఎస్‌ఆర్ సీపీ మండల ఉపాధ్యక్షుడు రామయ్య పాల్గొన్నారు.

అట్టహాసంగా అర్జున తపస్సు

- వైభవంగా ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి బ్రహ్మోత్సవాలు
- అర్జునుడికి పాశుపతాస్త్రం అందించిన పరమేశ్వరుడు
- తపస్సుమాను అధిరోహించిన అర్జునుడు
- అర్ధరాత్రి అలుగు ఉత్సవం



కామాక్షీ సమేత సదాశివేశ్వరుడి ఊరేగింపు, తపస్సు మాను అధిరోహిస్తున్న అర్జునుడు

పుత్తూరు: పట్టణంలోని శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. చివరి అంకంలోని తొలి రోజైన శుక్రవారం అర్జునుడి తపస్సును మెచ్చిన పరమశివుడు పాశుపతాస్త్రం అందించే ఘట్టం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. ఈ క్రమంలో ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు, మోహన్ ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో అమ్మవారిని అభిషేకించి వరలక్ష్మీదేవి అలంకరణ చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారు సర్వభూపాల వాహన ఉత్సవం కనుల పండుగగా జరిగింది. ఉదయం 10 గంటలకు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరుడు అధికార నంది వాహనంపై ఆశీనులై, మంగళవాయిద్యాలు, భక్తజన మంగళహారతుల నడుమ ఊరేగింపుగా ద్రౌపదీదేవి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పరమశివుడు అర్జునుడికి పాశుపతాస్త్రాన్ని అందించడం, తపస్సు మాను అధిరోహించిన ఘట్టం అందరినీ అలరించింది. మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక ఎలక్ట్రికల్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం 4 గంటలకు గుండ్లపుత్తూరు గ్రామస్తులు ఉత్తర గోగ్రహణం ఘట్టాన్ని నిర్వహించారు. రాత్రి 9 గంటలకు పట్టణ పురవీధుల్లో స్వామి అమ్మవార్లు ఊరేగుతూ స్థానిక రైల్వే స్టేషన్ వద్దకు చేరుకోగా రైల్వే ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక బాణాసంచా వేడుకలు నిర్వహించారు. అనంతరం పాటకచేరీ వినసొంపుగా సాగింది. అనంతరం పుత్తూరు లారీ ఓనర్స్ సంఘం ఆధ్వర్యంలో వరలక్ష్మీదేవి ద్రౌపదమ్మ విమాన మహోత్సవం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు బలిజ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ద్రౌపదీ తీర్థం అనబడే మంచినీళ్ల గుంట వద్ద అలుగును ప్రత్యేకంగా అలంకరించి, బాణాసంచా, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయంలో స్వామి, అమ్మవార్ల సమక్షంలో కుంభాగ్రంపై (పచ్చికుండపై 4 అడుగుల కత్తిని తలకిందులుగా నిలబెట్టుట) అలుగును నిలబెట్టారు. రాత్రి 12 గంటలకు కుమ్మర సంఘం ఆధ్వర్యంలో కాళికాదేవికి ఇలావంతుని బలి ఇచ్చారు. కార్యక్రమాలను సాత్వాకం వంశీకులైన ఆలయ కోవిల్‌కార్లు ఏలుమలై మొదలి, నటరాజ్ మొదలి, గోపిమొదలి, వెంకటేష్ మొదలి, పార్థసారథి మొదలి, కుప్పుస్వామి మొదలి పర్యవేక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో పటిష్ట భద్రత:

శ్రీద్రౌపదీ సమేత శ్రీధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో పుత్తూరు డీఎస్పీ జి.రవికుమార్ నేతృత్వంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఉదయం సదాశివేశ్వరస్వామి ఊరేగింపు, అర్జున తపస్సు కార్యక్రమాలు పోలీసుల బందోబస్తు నడుమ సాగాయి. సాయంత్రం 4 గంటలకు స్థానిక రైల్వే స్టేషన్ వద్ద డీఎస్పీ రవికుమార్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ రైల్వే స్టేషన్ వద్ద రాత్రి భారీగా జరిగే బాణాసంచా సందర్భంగా, తర్వాత జరిగే పాటకచేరీ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రత కల్పించారు.

నేడు రథోత్సవం:

ఉదయం 9 గంటలకు గరుడసేవ, శ్రీకృష్ణరాయబారం. మధ్యాహ్నం 3 గంటలకు దుర్యోధన వధ, పాండవ విజయం. 4గంటలకు శ్రీకృష్ణ రథం, గజ, తురగ, పదాతులు ముందు నడుస్తుండగా పాండవులు మహారథాన్ని అధిరోహించి విహరించే కార్యక్రమాలు ఉంటాయి.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం


వెదురుకుప్పం: కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో పూజలు


వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు


వెదురుకుప్పం: చవటగుంటలో నరసింహ స్వామి ఆలయంలో మహిళల పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

కార్వేటినగరం: వరలక్ష్మీ వ్రతం వేడుకలను మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వెలసి ఉన్న శ్రీదౌపదీ ధర్మరాజుల ఆలయంలో అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వైఎస్‌ఆర్ సీపీ పట్టణ అధ్యక్షురాలు మోహనకుమార్ ఆధ్వర్యంలో వెయ్యి మందికి వరలక్ష్మీ వ్రతం పూజా సామగ్రిని అందించారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు గాజులు, జాకెట్లు, లక్ష్మీదేవీ చిత్రపటాన్ని అందించారు. మధ్యాహ్నం వెయ్యి మందికి అన్నదానం చేపట్టారు. టీటీడీకి అనుబంధంగా ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణు గోపాలస్వామి ఆలయ ఆవరణలో వెలసి ఉన్న శ్రీలక్ష్మీదేవి ఆలయంలో కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వ్రతాన్ని చేపట్టారు. అదే విధంగా మండలంలోని ఆలత్తూరు సమీపంలో వెలసి ఉన్న ముత్యాలమ్మ, బంగారమ్మ, పడివేటమ్మ ఆలయాల్లో కూడా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో చేపట్టారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మహిళలు పెద్ద ఎత్తున ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. భక్తి ప్రపత్తులతో నూతన వస్త్రాలు సమర్పించి అమ్మవారి ప్రతిమను ఉంచి ఆకర్షణీయంగా అలంకరించి వ్రతమాచరించారు. డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయం, చవటగుంటలోని నరసింహ స్వామి ఆలయం, చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిమలను వేంచేపు చేసి ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళా భక్తులు తీసుకొచ్చిన పూజ సామగ్రిని అమ్మవారి వద్ద ఉంచి కొలిచారు.

వరలక్ష్మీ నమోస్తుతే!

నింద్ర: మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేఆర్ పాళెం గ్రామంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: ఎస్‌ఆర్ పురం మండలం తయ్యూరు పాయికట్టు ఇలవేల్పు శ్రీఆరిమాని గంగమ్మ తల్లి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటాచలపతి ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి తెప్పోత్సవాలు

కార్వేటినగరం: ఈ నెల 17 నుంచి టీటీడీ ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామి తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ అధికారి మాట్లాడారు. 17 వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మూడు రోజులపాటు తెప్పోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

కార్యక్రమాల వివరాలు

17 తేదీ శనివారం 9.30 నుంచి 10.30 గంటల వరకు కోదండరామ స్వామివారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య స్వామివారికి తిరువీధి ఉత్సవం ఉంటుంది. రాత్రి 6 గంటల నుంచి 7.30 గంటల వరకు స్కంధపుష్కరిణిలో సీతా, లక్ష్మణ సమేత శ్రీకోదండరామ స్వామివారు తెప్పపై మూడు చుట్లు విహరిస్తారు. 18వ తేదీ ఆదివారం ఉదయం 9.30నుంచి 10.30 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామివారికి వేదపండితులతో స్నపన తిరుమంజనం ఉంటుంది. సాయంత్రం 4గంటలకు వేణుగోపాలుని తిరువీధి ఉత్సవం, రాత్రి తెప్పోత్సవం ఉంటుంది. ఉభయ దేవేరులతో పాటు స్వామివారు 5 చుట్లు విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. 19వ తేదీ సోమవారం 9గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 4గంటలకు గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. తెప్పోత్సవాల్లో ఆఖరి రోజు స్వామివారు 7 చుట్లు విహరించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బాలగురునాథీశ్వర స్వామికి శ్రావణ పూజలు



స్వామివారికి ప్రత్యేక పూజలు, దీపారాధనలు, ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పాలసముద్రం: మండలంలోని రాచపాళెం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వరస్వామికి శుక్రవారం శ్రావణ మాస ప్రత్యేక యాగశాల పూజలు చేపట్టారు. ఉదయం వివిధ యాగశాల పూజలు చేశారు. వారం రోజులుగా ప్రత్యేక యాగశాల పూజలు చేసిన కలశంతో వేదపండితులు మూడు సార్లు ఆలయ ప్రదక్షిణ చేపట్టారు. స్వామివారికి యాగశాలలో ఉన్న కలశ నీటితో అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామివారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యిలతో వివిధ అభిషేకాలు చేశారు. బెంగళూరు నుంచి తీసుకొచ్చి వివిధ సుగంధ పుష్పాలతో స్వామివారిని సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. చివరి రోజు మండల పరిధిలోని, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పంచామృతం, తీర్థ ప్రసాదాలు అందించారు.

డ్యూటీ ఆపరేటర్లు జాగ్రత్తగా పని చేయాలి


సమావేశంలో పాల్గొన్న విద్యుత్ శాఖ సిబ్బంది

పూతలపట్టు: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పనిచేసే డ్యూటీ ఆపరేటర్లు జాగ్రత్తగా పని చేయాలని ఆ శాఖ ఈఈ మునిచంద్ర తెలిపారు. శుక్రవారం పూతలపట్టు సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షిఫ్ట్ ఆపరేటర్లు ప్రతి గంటకు రీడింగ్ తీయాలన్నారు. బ్రేకర్‌కు అమర్చే బ్యాటరీస్ ఎప్పటికప్పుడు తనిఖీ చేసి లాగ్ బుక్‌లో రికార్డ్ చేయాలన్నారు. మత్తు పానీయాలు సేవించి డ్యూటీ చేయకూడదని హెచ్చరించారు. అనంతరం సిబ్బంది 11 కేవీ లైన్‌లో ట్రీ కటింగ్ చేసి వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. వ్యవసాయ బిల్లుల వసూలుపై దష్టి సారించాలన్నారు. బ్రేక్ డౌన్లు అధికంగా ఉన్నాయని లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు లైన్లు తనిఖీ చేసి బ్రేక్ డౌన్ తగ్గించాలని ఆదేశించారు. డీసీ లిస్టుపై ప్రత్యేక దృష్టి పెట్టి కరెంటు బకాయిలు వసూలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ జ్ఞానేశ్వర్, ఏఈ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.